క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


ఏఈవో రాంబాబుకు చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం మురళీనగర్‌కు చెందిన జి.వెంకటేశ్వరరావు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. సంబంధిత చెక్కును సింహగిరిపై ఉన్న పీఆర్‌వో కార్యాలయంలో ప్రోటోకాల్ ఏఈవో రాంబాబు, సూపరింటిండెంట్ విక్రమ్‌లకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ వరహానరసింహం పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు


పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న నరసింగరావు

సబ్బవరం: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అద్భుత విజయం సాధించడంతో ఆ పార్టీ నేతలు సబ్బవరంలో సంబరాలు జరుపుకున్నారు. మిఠాయిలు తినిపించుకున్నారు. బాణసంచా కాల్చి ఆనందంలో మునిగిపోయారు.ఈ సదర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు గొంప నరసింగరావు మాట్లాడుతూ 27 ఏళ్ల తరువాత ఢిల్లీ పీఠాన్ని కైవసం చేసుకోవడం ప్రధాని మోదీ విధానాలే కారణమన్నారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు వనం సత్యనారాయణ, కె. శ్రీనివాసవర్మ, జి.సత్యప్రసాద్, పి.అప్పారావు, ఎం. స్వామిచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, సర్పంచ్ శిరీష దంపతులు

పెందుర్తి: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని సాధుమఠం ప్రాంగణంలోని రామాలయంలో శనివారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ మూర్తులకు అభిషేకాలు జరిపి విశేష అలంకరణ చేశారు. వేదమంత్రోక్తంగా కల్యాణం జరిపారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ చేపట్టారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష, మాజీ ఎంపీటీసీ వెన్నెల సన్యాసినాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆ నిందితులను కఠినంగా శిక్షించాలి


అయోధ్యలో దళిత యువతిపై లైంగిక దాడికి నిరసన తెలుపుతున్న మహిళా సంఘాలు

పరవాడ: ఆధ్యాత్మిక కేంద్రం అయోధ్యలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఇటీవల ఓ దళిత యువతిపై లైంగికదాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య అనకాపల్లి జిల్లా కార్యదర్శి బూసి పరమేశ్వరి డిమాండ్ చేశారు. ఈ సంఘటనను ఖండిస్తూ ఎన్ఎఫ్ఐడబ్ల్యు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో దేశపాత్రునిపాలెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. బూసి పరమేశ్వరి మాట్లాడుతూ భాగవతం వినడానికి గుడికి వెళ్లిన దళిత యువతి చిత్రవధకు గురై హత్యకు గురికావడం తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. ఈ దుర్ఘటన ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటనను తలపిస్తోందన్నారు. కళ్లు పీకేసి, కాళ్లు, చేతులు విరిచేసి ఇంకా చెప్పలేని విధంగా ఆ యువతిని హింసించారంటే దేశంలో మహిళలకు రక్షణ ఉందా? చట్టాలంటే భయం ఉందా అని ప్రశ్నించారు. బీజేపీ ఏలుబడిలో దళితులు, ఆదివాసీలు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో బి.తులసి, కె.లక్ష్మి, బి.నారాయణమ్మ, వి.మున్నీ, కె.రమ్య పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

ఏయూక్యాంపస్: సాగర తీరంలో పోలీసులు శనివారం సాయంత్రం తనిఖీలు చేశారు. వాహన చోదకులు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారా అనేది బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించారు. ఆల్ ఎబిలిటీ పార్క్ ఎదురుగా పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, కార్లలో ప్రయాణిస్తున్న వారిని ఆపి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించారు.


గోశాల కూడలిలో వేపగుంటవైపు, గోపాలపట్నం వైపు అడ్డదిడ్డంగా ప్రయాణిస్తున్న వాహనాలు


గోశాల వద్ద జరిగిన ప్రమాదంలో పగిలిన కారు అద్దాలు (ఫైల్)


తొలిపావంచా వద్ద రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన ట్రాలీ స్టాపర్లు

జంక్షన్.. టెన్షన్

ప్రమాదభరితంగా గోశాల కూడలి

ఏ వాహనం ఎటు వెళ్తుందో తెలియని వైనం

అతి వేగంతో ప్రమాదాలు

సింహాచలం : బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ తర్వాత అడవివరంలోని గోశాల కూడలి అంటేనే వాహనదారులు, పాదచారులు భయపడుతున్నారు. వేపగుంట, గోపాలపట్నం, హనుమంతవాక నుంచి సింహాచలం మీదుగా వచ్చి వెళ్లే రహదారిలో ప్రధాన కూడలిగా మారిన గోశాల జంక్షన్ వద్ద ఏ వాహనం ఎటు వెళ్తుందో తెలియని పరిస్థితి నెలకుంది. ఏ ప్రమాదం ఎప్పుడు సంభవిస్తుందోనని హడలిపోతున్నారు. పెందుర్తి బీఆర్‌టీఎస్ కారిడార్‌లో భాగంగా గోశాల జంక్షన్ భారీగా విస్తరించారు. నిత్యం అటు గోపాలపట్నం నుంచి, ఇటు వేపగుంట నుంచి వేలాది వాహనాలు గోశాల జంక్షన్ మీదుగానే నగరంలోకి రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ మార్గాల్లో ప్రతినిత్యం వేలాది మంది భక్తులు సింహాచలం శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వెళ్లివస్తుంటారు. అటు అడవివరం వైపు నుంచి గోశాలకు చేరుకునే బీఆర్‌టీఎస్ రోడ్డు, ఇటు వేపగుంట నుంచి సింహాచలం చేరుకునే బీఆర్‌టీఎస్ రోడ్డు, మరోపక్క గోపాలపట్నం నుంచి సింహాచలం చేరుకునే డబుల్ రోడ్డుకు ప్రధాన కూడలిగా ఉన్న గోశాల జంక్షన్ వద్దకు వచ్చేసరికి వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ ప్రాంతంలో ఏవాహనం ఎటువైపు నుంచి వస్తుందో అంచనా వేయలేకపోవడం, అమిత వేగంతో మలుపులు తిరుగుతుండటం, అవగాహన లోపంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.


గోశాల కూడలిలో వేపగుంటవైపు, గోపాలపట్నం వైపు రాంగ్‌రూట్లో వాహనాలు

రాంగ్ రూట్లలో ప్రయాణం

గోశాల కూడలికి సమీపంలోనే సింహాచల్‌నగర్, సాయినగర్, మైత్రీనగర్ ఉన్నాయి. గోపాలపట్నం, సింహాచలం నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు రాంగ్ రూట్లో వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీంతో గోశాల కూడలిలో అంతా గందరగోళ పరిస్థితులు నెలకున్నాయి.

పూర్తికాని బీఆర్‌టీఎస్ పనులు

వేపగుంట నుంచి గోశాల వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు పనులు పూర్తయ్యి పదేళ్లు గడిచాయి. అలాగే గోపాలపట్నం నుంచి గోశాల వరకు డబుల్ రోడ్డు పనులు ఎనిమిదేళ్ల క్రితం పూర్తయ్యాయి. అయితే గోశాల నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు పనులను మాత్రం 2023 నవంబర్‌లో ప్రారంభించారు. 2024 మే నెలలో జరిగిన చందనోత్సవం, జూలైలో జరిగిన గిరి ప్రదక్షిణల సందర్భంగా యుద్ధప్రాతిపదికన రోడ్డు వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మిగతా పనులు జరగలేదు. ముఖ్యంగా మరో రోడ్డు లేయర్ వేయాల్సి ఉంది. జీబ్రా లైన్స్, సిగ్నల్ లైట్లు, సర్కిల్ పాయింట్లు, విద్యుద్దీపాల ఏర్పాటు తదితర పనులు జరగాల్సి ఉంది. పనులు పూర్తయితేనే గానీ గోశాల కూడలి వద్ద వాహనాల స్పీడ్‌కు కళ్లెం వేయలేని పరిస్థితి ఉంది.

ఇలా చేస్తే..

- రోడ్డు పనులు పూర్తయ్యే వరకు గోశాల కూడలిలో నిత్యం ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలి. సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసే వరకు మ్యానువల్‌గా వాహనాల రాకపోకలకు పోలీసులు సంకేతాలివ్వాలి.
- మితిమీరిన వేగంతో వెళ్తున్న వావానాలపై నిఘా పెట్టాలి. వాహనదారులకు జరిమానా విధించాలి.
- మలుపులు ఏవిధంగా తిరగాలో తెలియజేస్తూ తాత్కాలికంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
- మితిమీరిన వేగంతో మలుపులు తిరగకుండా ట్రాలీ స్టాపర్‌లు ఏర్పాటు చేయాలి.

ప్రమాదాలెన్నో..

- ఈనెల 7న నాయుడుతోటకు చెందిన సరస్వతి, కిరణ్ గోపాలపట్నం వైపు నుంచి సింహాచలం వెళ్తుండగా సింహాచలం నుంచి వేపగుంట వైపు మలుపు తిరుగుతున్న కారు గోశాల జంక్షన్‌లో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈప్రమాదంలో సరస్వతికి గాయాలయ్యాయి.
- రెండు నెలల క్రితం సింహాచలం నుంచి వేపగుంట వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు గోశాలకూడలి వద్ద మలుపు తిరుగుతూ గోపాలపట్నం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న వారు త్రటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

భయం భయంగానే..



గోశాల వద్ద ఏ వాహనం ఎటు వెళ్తుందో తెలియని పరిస్థితి ఉంది. సింహాచలం నుంచి వేపగుంటవైపు వెళ్లే వాహనాలు అమిత వేగంతో మలుపులు తిరుగుతున్నాయి. ఒక వైపు గోపాలపట్నం నుంచి సింహాచలం వెళ్లే వాహనాలు, మరో వైపు సింహాచలం నుంచి వేపగుంట వైపు వెళ్లేవాహనాలు ఎదురెదురుగా రోడ్డు మధ్యలోకి వచ్చేసరిగి ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం వెంటాడుతోంది.

– నూకరాజు, సింహాచల్‌నగర్

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



బీఆర్‌టీఎస్ పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసి గోశాల వద్ద రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలి. గోపాపట్నం నుంచి వచ్చే మార్గంలో ప్రస్తుతం ఉన్న తాత్కాలిక స్పీడ్‌బేకర్ల స్థానంలో పక్కాగా స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. అలాగే సింహాచలం నుంచి వేపగుంట, గోపాలపట్నం వైపు వెళ్లే మార్గంలో స్పీడ్ బ్రేకర్లు లేవు. ఆ మార్గంలో స్పీడ్ బేకర్లు ఏర్పాటు చేయాలి.

– చిన్ని, సింహాచలం

చర్యలు తీసుకుంటాం

బీఆర్‌టీఎస్ రోడ్డు పనులు పూర్తిగా జరిగితే గోశాల కూడలి వద్ద ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకునేందుకు వీలు ఉంటుంది. అప్పటి వరకు ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. ఆయా ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తాం. వాహనాల వేగానికి కళ్లెం వేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ, గోపాలపట్నం

కనులపండువగా వెంకన్న వార్షిక కల్యాణోత్సవం

- విశేషంగా గ్రామ తిరువీధి
- పరవశించిన భక్తజనం


వెంకన్న కల్యాణ ఉత్సమూర్తులు


అడవివరం గ్రామంలో వెంకన్నకు తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉపాలయమైన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి వార్షిక కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న వేదికపై స్వామివారి వెంకన్న, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను వేంజేంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేషంగా హారతులిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. స్వామివారి కల్యాణ అక్షింతలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు. అర్చకులు శ్రీకాంత్, భార్గవ్ తదితరులు కార్యాక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు సాయంత్రం 4గంటల నుంచి అడవివరం గ్రామంలో స్వామికి తిరువీధి వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో వేంజేంపజేసి గ్రామ పురవీధుల్లో తిరువీధి నిర్వహించారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన స్వామికి గ్రామస్తులు హారతులు పట్టి ఆశీసులు పొందారు.

త్రిపురాంతకస్వామి ఆలయంలో....

భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరి క్షేత్ర పాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలో పార్వతీపరమేశ్వరుల వార్షిక కల్యాణోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. రాత్రి 9.30 గంటల నుంచి ఉత్సవమూర్తులకు తిరువీధిని నిర్వహించారు. అనంతరం వార్షిక కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వెలమలపల్లి రమణమూర్తి తదితరులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా భీష్మ ఏకాదశి


స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న గండి రవికుమార్ తదితరులు

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని రామాలయంలో శ్రీ సీతారాములకు శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త చింతా వెంకట సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామి వారిని పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో గొంప వెంకట సన్యాసిరావు, చింతా సుబ్రహ్మణ్యం, అర్చకుడు సుబ్బారావు పంతులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాల బోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ


మాట్లాడుతున్న డీఈవో గిడ్డి అప్పారావు

సబ్బవరం: సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. పునాది అభ్యాసన -సంఖ్యా శాస్త్రం అనే అంశంపై 1,2 తరగతుల విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు డిసెంబర్ 16 నుంచి నేటి వరకూ నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి అంశాన్ని తరగతి గదుల్లో విద్యార్థులకు బోధించాలన్నారు. ప్రాథమిక విద్యా బోధన పటిష్టంగా ఉన్నప్పుడే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి సుమారు 1,212 మంది ఉపాధ్యాయులు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకునేందుకు విశ్వవిద్యాలయంలో అవకాశం కల్పించినందుకు వీసీ డాక్టర్ సూర్యప్రకాశరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవో (అకడమిక్ మోనటరింగ్ అఫీసర్) మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు


ఎన్టీపీసీ మెయిన్ గేటు వద్ద భారీ వాహనాలతో నిలిచిన ట్రాఫిక్

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీకి యంత్ర సామగ్రితో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ ప్లాంట్‌కు సుదూర ప్రాంతాల నుంచి యంత్ర పరికరాలతో నిత్యం భారీ వాహనాలు వస్తుంటాయి. ప్లాంటు లోపలికి వెళ్లాలంటే ముందుగా సెక్యూరిటీ అనుమతి తీసుకోవలసి ఉంది. అనుమతి తీసుకొన్న వాహనాలను మాత్రమే లోపలికి అనుమతిస్తారు. ఒక్కొక్క పర్యాయం అనుమతి పొందిన భారీ వాహనాలకు సకాలంలో సెక్యూరిటీ సిబ్బంది లోపలికి పంపడంలో ఆలస్యమవుతున్న కారణంగా రోడ్డుపైన నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఎన్టీపీసీలో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు వాడచీపురుపల్లి, తంతడి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, పరవాడ, గాజువాక తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికులు ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తుంటారు. తరచూ ఎన్టీపీసీ కూడలిలో రోడ్డుపై నిలుపుతున్న భారీ వాహనాలతో ఏర్పడుతున్న ట్రాఫిక్ వలయంలో చిక్కుకుపోయి గంటల తరబడి అవస్థలు ఎదుర్కొంటున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారులు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా భూలోకమాంబ విగ్రహ ప్రతిష్ట


భూలోకమాంబ అమ్మవారి నూతన విగ్రహం


పూజల్లో పాల్గొన్న పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు పరిధి అప్పన్నపాలెంలో భూలోకమాంబ నూతన ఆలయం, నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 11.13 గంటలకు విగ్రహ ప్రతిష్ట, ఆలయ శిఖర ప్రతిష్ట కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేష హోమాలు నిర్వహించారు. పూర్ణాహుతిని శాస్త్రోక్తంగా జరిపారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. అప్పన్నపాలెం, సింహపురి కాలనీ, బాలాజీ హిల్స్ వ్యూ, సింహపురి లేఅవుట్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, కార్పొరేటర్లు బల్ల శ్రీను, రాపర్తి కన్నా, వైఎస్సార్ సీపీ నాయకులు గండి రవికుమార్, బెహరా భాస్కరరావు, 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, నాయకులు నడింపల్లి రామరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి, పల్లా వెంకటరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గ్రంథాలయానికి గ్రహణం

- లైబ్రేరియన్ లేక తెరుచుకోని వైనం
- నిరాశ చెందుతున్న పాఠకులు


మూత పడిన వాడచీపురుపల్లి శాఖా గ్రంథాలయం

పరవాడ: వాడచీపురుపల్లి శాఖా గ్రంథాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో వారంలో రెండు రోజులు మాత్రమే గ్రంథాలయం అందుబాటులో ఉంటుంది. ఇక్కడ పనిచేస్తున్న గ్రంథాలయాధికారిని మల్కాపురానికి ఏడాది క్రితం బదిలీ చేశారు. ఆ స్థానంలో మరొకర్ని నియమించకపోవడంతో గ్రంథాలయం తరచూ మూతపడుతోంది. ప్రస్తుతం ఆయనే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. సదరు గ్రంథాలయాధికారికి వారానికి రెండు రోజులు మాత్రమే ఇక్కడ గ్రంథాలయం తెరుస్తున్నారు. మిగిలిన రోజుల్లో తాత్కాలిక సిబ్బంది గ్రంథాలయం తెరుస్తున్నప్పటికీ కేవలం దిన పత్రికలు చదివే వీలు మాత్రమే కల్పిస్తున్నారు. మరో గదిలో భద్రపర్చిన విలువైన పుస్తకాలు, కాంపిటేటివ్ పరీక్షల సమాచారం కోసం వచ్చే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో లేక వెనుదిరుగుతున్నారు. అలాగే అధికారుల నిర్లక్ష్యంతో శాఖా గ్రంథాలయ భవనానికి చాలా కాలం నుంచి మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో గ్రంథాలయాధికారిని నియమించాలని పాఠకులు కోరుతున్నారు.


పెచ్చులూడుతున్న శ్లాబు